క్లుప్తంగా

క్షీరాభిషేకం



రాయపర్తి : స్థానిక బస్టాండ్ ఆవరణలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూనె అనిల్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా కుల గణనకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అన్ని వర్గాలకూ ప్రయోజనాలు చేకూర్చేలా ప్రధాని మోదీ అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి వడ్లకొండ రవి, యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రావణ్ కుమార్, యువ మోర్చా మండల అధ్యక్షుడు మంచాల సుమన్, నాయకులు మందపురి రాజు, బండారి ధినేశ్, జక్కుల సందీప్, నరేశ్, శివనేత్ర, రాజు, వెంకటేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ



నర్సంపేట : పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘ భవన ఆవరణలో ఏర్పాటు చేసిన ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు లక్క చంద్రయ్య, లక్క కొమురయ్య విగ్రహాలను అధ్యక్షుడు రుద్రారపు పైడయ్య అధ్యక్షతన మాజీ సర్పంచ్ నల్ల మనోహర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది పింగిళి మాధవరావు గురువారం ఆవిష్కరించారు. అనంతరం మనోహర్‌రెడ్డి, మాధవరావు మాట్లాడారు. కార్మికులు ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు లక్క నరేందర్, ఉపాధ్యక్షులు ఓడెల చంద్రయ్య, దేవాండ్ల రాంబాబు, సహాయ కార్యదర్శులు నెలకంటి కుమారస్వామి, పులిచేరి గోపి, కోశాధికారి కందికొండ రాజు, ప్రచార కార్యదర్శి పాలకుర్తి మధు, మాజీ అధ్యక్షులు సామల స్వామి, జినుకల సారంగం, సామల స్వామి, సభ్యులు లక్క సాయిబాబా, లక్క కృష్ణ, జినుకల రాములు, రవి, రాజు, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లికి చెందిన గుండ్లపల్లి అశోక్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి స్థానిక ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయదారుల వాట్సప్ గ్రూప్ సభ్యులు గ్రామస్తుల సహకారంతో గురువారం రూ.89 వేల సాయం అందజేశారు. తొలుత అశోక్ కుటుంబాన్ని గ్రూప్ అడ్మిన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు పులి దేవేందర్ పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెరుమాండ్ల శ్రీధర్‌రెడ్డి, ఊడుగుల సాంబయ్య, మాజీ ఎంపీటీసీ చెరుపల్లి విజేందర్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మాటూరి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఆర్ఆర్' ఆధ్వర్యంలో..

రాయపర్తి : మండలంలోని రాగన్నగూడెంకు చెందిన ముకుందరెడ్డి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి కొంత నగదుతోపాటు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం సన్నూరులో అనారోగ్యంతో బాధపడుతున్న మడిపెద్ది పూలమ్మను, వడ్ల సోమయ్యను పరామర్శించి రూ.5.వేల చొప్పున సాయం అందించారు. కార్యక్రమాల్లో ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, కంది ప్రభాకర్, పరుపాటి రవీందర్‌రెడ్డి, గజవెల్లి ప్రసాద్, ఐత రాంచందర్, ఎల్లస్వామి, సరికొండ రాజిరెడ్డి, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పర్వతగిరి : మండలంలోని బూర్గుమళ్లకు చెందిన దెంచినాల చంద్రమౌళి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు చింతల శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. తొలుత చంద్రమౌళి చిత్రపటానికి శ్రీనివాస్ నివాళులర్పించారు.

మంగళవారిపేటలో..

ఖానాపురం : మండలంలోని మంగళవారిపేటకు చెందిన శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గొల్లకురుమ యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు ఆధ్వర్యంలో పరామర్శించారు. తొలుత శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు వెంకన్న, శ్రీను, వేల్పుల లింగయ్య, కుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేడే

సంగెం : జెండా ఎగరేస్తున్న తాపీ మేస్త్రీల సంఘం నాయకులు, కార్మికులు



వర్ధన్నపేట : ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద..



దుగ్గొండిలో..



జిల్లావ్యాప్తంగా కార్మికులు గురువారం మేడే వేడుకలు నిర్వహించారు. అన్ని మండలాల్లోనూ భవన నిర్మాణ, ఇతర రంగాల కార్మికులు ఎర్రజెండా ఎగరేశారు. రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు సైతం ఎర్రజెండా ఎగరేసి వేడుకల్లో భాగస్వాములయ్యారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాలను కోరారు. - సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట : జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్



ఖానాపురం : మంగళవారిపేట సబ్‌స్టేషన్‌లో..



నెక్కొండలో..



నర్సంపేట : సీపీఎం ఆధ్వర్యంలో..



పర్వతగిరిలో..



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలో..



నర్సంపేట రూరల్ : మాధన్నపేటలో..



నల్లబెల్లిలో..



రాయపర్తిలో..



ఖానాపురంలో..

రైతుల ప్రయోజనాలే ధ్యేయం

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరీశ్‌రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ హరీశ్‌రెడ్డి

నెక్కొండ : రైతుల ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నాగారంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించొద్దని కోరారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి సరైన ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని నిర్వాహకులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొమ్మెరబోయిన రమేశ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ, గ్రామ శాఖ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, ఉప్పల లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు పొలిశెట్టి భానుప్రకాశ్, నాయకులు నాంపెల్లి శ్రీనివాస్, జమ్ముల సోమయ్య, తాళ్లపెల్లి సాంబయ్య, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే మెరుగైన ఫలితాలు



ఝాన్సీని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ అపర్ణ, తదితరులు

- పీఎంశ్రీ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్ అపర్ణ

పర్వతగిరి : ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ కార్యవర్గం సమష్టి కృషి ఫలితంగానే పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని మండల కేంద్రంలోని పీఎం శ్రీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల స్కూల్ ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. పదో తరగతిలో 567 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన కె.ఝాన్సీని పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులతో కలిసి ప్రిన్సిపాల్ స్కూల్ ఆవరణలో గురువారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన పోశాల కీర్తన (558), అంగోతు మానస (555), సౌమ్యశ్రీ (542), టెడ్డీ పల్లవి (542), గడ్డం నిత్యశ్రీ (524)లను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జ్యోత్స్న, స్వాతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఇల్లందుల రాణి, వైస్ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, సభ్యులు మాంకాల యాదగిరి, ఉపేందర్, మేకల మల్లికార్జున్, పసునూరి భాస్కర్, బిర్రు కరుణాకర్, గోగుల లావణ్య, బలపాక స్వప్న, ముజ్జిగా అనిల్, పొనుగంటి స్వామి, యాకూబ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో విద్యుత్ ప్రమాదాల నివారణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈ తిరుపతి, ఏడీఈ, తదితరులు

- ట్రాన్స్‌కో డీఈ తిరుపతి

దుగ్గొండి : సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా విద్యుత్ ప్రమాదాలను నివారించొచ్చని నర్సంపేట ట్రాన్స్‌కో డీఈ తిరుపతి తెలిపారు. మండలంలోని తొగర్రాయిలో గురువారం నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యుత్ ప్రమాదాల బారిన పడి మృతి చెందిన ఘటనల్లో అత్యధిక శాతం సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల జరిగినవేనని స్పష్టం చేశారు. విద్యుత్ సమస్య తలెత్తితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం అందించాలని సూచించారు. సుశిక్షితులైన విద్యుత్ సిబ్బంది సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. వ్యవసాయ బావులు, విద్యుత్ మోటార్లు, తదితరాలకు మరమ్మతులు సొంతంగా చేయొద్దని కోరారు. విద్యుత్‌తో చెలగాటడం ఆడి కుటుంబాలను అనాథలను చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ లక్ష్మన్, ఏఈ ప్రత్యూష, లైన్ ఇన్‌స్పెక్టర్ అజీం పాషా, లైన్‌మెన్ అజయ్, మాజీ సర్పంచ్ ఓడేటి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజ్'లను బీసీ'ఏ'లో చేర్చాలి

- టీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యువరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న యువరాజ్

గీసుకొండ : బీసీ జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న నేపథ్యంలో ముదిరాజ్ కులస్తులను బీసీఏలో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ సమాజ్ (టీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. సమాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆత్మగౌరవ పాదయాత్ర మండలంలోని పోతరాజుపల్లి, గొర్రెకుంట మీదుగా గురువారం సాగింది. ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లోనూ వెనుకబడ్డారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్ నెరవేర్చాలని, ముదిరాజ్ కార్పొరేషన్‌కు ఏటా రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గొర్రెకుంట మత్స్య, ముదిరాజ్ కుల సంఘాల నాయకులు కందుల నారాయణ, అశోక్, కళావతి, విజయ, చిన్న రాజు, ఎల్లయ్య, రాజేశ్, రమేశ్, శివశంకర్, చిన్న రాజేశ్, శ్రీకాంత్, లావణ్య, పోషాలు, సౌందర్య, వనమాల, సుమలత, మురళి తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటుకుని మొక్కజొన్న దగ్ధం

దామెర : నిప్పంటుకుని మొక్కజొన్న చేను దగ్ధమైన సంఘటన మండలంలోని తక్కళ్లపహాడ్‌లో గురువారం చోటుచేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని దాడి భిక్షపతి, రవి 3 ఎకరాల్లో మొక్కజొన్న చేను సాగుచేశారు. కాగా చేను ఎండిపోయి ఇటీవల వచ్చిన ఈదురు గాలికి నేలకొరింగింది. దీంతో రైతులు మొక్క జొన్న కంకులను చేను నుంచి వేరుచేసి బస్తాల్లో నింపి అక్కడే నిల్వ ఉంచారు. కాగా గురువారం ఉదయం రైతులు వెళ్లి చూసేసరికి మంటలు అంటుకుని కాలిపోయినట్లు తెలిపారు. అదే విధంగా కరెంటు మోటర్ వైరు, పైపులు కాలిపోయినట్లు రైతులు వాపోయారు. ఇద్దరు రైతులకు సుమారు 3 లక్షల వరకు పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో కలిబూడిదైందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నారు.

శ్రీకాంత్‌కు శ్రమశక్తి అవార్డు



ఖిలా వరంగల్ : కార్మికుల సంక్షేమానికి నిరంతరం పాటుపడుతున్న ఖిలా వరంగల్ తూర్పుకోటకు చెందిన బిల్లా శ్రీకాంత్‌కు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డును ప్రకటించింది. మే డే సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో కార్మిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో శ్రీకాంత్‌కు రాష్ట్ర కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, లేబర్ కమిషనర్ నగదు పురస్కారంతోపాటు శ్రమశక్తి వార్డును అందజేసి సన్మానించారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

కొత్తగూడ: విద్యుదాఘాతానికి మూడు పాడి గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలోని ఓటాయి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు పొలాల్లోని 11కేవీ విద్యుత్ వైర్ తెగి కింద పడింది. అది ఎవరు గమనించలేదు. మేతకు వెళ్లిన పాడి గేదెలు తిరిగి ఇంటికి వచ్చే సమయంలో కింద పడిన వైర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

తల్లిదండ్రులు మందలించడంతో..

దామెర : తల్లిదండ్రులు మందలించారని యువకుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని దమ్మన్నపేట్‌లో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బుమా నవీన్ (23) తల్లిదండ్రులు మందలించడంతో 27న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. నవీన్ తండ్రి సాంబమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు దామెర పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వేసవి దుక్కులతో భూమికి మేలు

- లోతుగా దున్నడంతో చీడపీడల నివారణ
- సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు



ట్రాక్టర్‌తో వేసవి దుక్కి దున్నతున్న రైతు

నెక్కొండ : వేసవి దుక్కులతో పంట పొలాలకు మేలు జరుగుతుంది. నాగళ్ల సాళ్లతో భూమి వదులుగా మారి ప్రయోజనాలు చేకూరుతాయి. చీడపీడల ప్రభావం తగ్గి పంట దిగుబడులు పెరుగుతాయి. కొద్దిరోజులుగా అక్కడక్కడా చిరుజల్లులు కురుస్తుండడంతో మండలంలో రైతులు వేసవి దుక్కులు దున్నుతున్నారు. పొలాల్లో మిగిలిన వ్యర్థాలను కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారి మట్టిని పెకలించడంతో భూమిలో గాలి శాతం పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

సుమారు 30 వేల ఎకరాల్లో పంటల సాగు

మండలంలోని సుమారు 30 వేల 249 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఫిబ్రవరి నుంచి మే వరకు పొలాలు ఖాళీగా ఉంటాయి. ఏప్రిల్, మే నెలల్లో అడపదడపా వర్షాలు కురిసే అవకాశం ఉన్న క్రమంలో పొలాలను 25 నుంచి 75 సెంటిమీటర్ల లోతులో దుక్కి దున్నితే తొలకరి పైరు వేసుకునేందుకు అనువుగా ఉంటుంది. ఈ క్రమంలో పలువురు రైతులు నాగళ్లు, ట్రాక్టర్లతో దుక్కి దున్నుతున్నారు. దీంతో కలుపు మొక్కలు పైకి లేచి ఎండకు మాడిపోతాయి. భూమిలో వివిధ దశలో ఉండే పురుగులు పైకి రావడంతో వాటిని పక్షులు తినేస్తాయి. తద్వారా పురుగులు నశించి పైరుకు మేలు జరుగుతుంది. వేసవి దుక్కులతో మొక్కల వేరు వ్యవస్థ బలపడి పోషకాలు అందుతాయి. భూమి స్థితిని బట్టి దున్నితే లోతైన పొరల్లో నేల గుల్లబారి వర్షం కురిసినప్పుడు భూమి పొరల్లోకి వెళ్లి పైరుకి నీటి ఎద్దడి లేకుండా కాపాడుతుంది.

వరికొయ్యలను కాల్చొద్దు



పొలంలో కలియదున్నితే దిగుబడి పెరుగుతుంది. వరికొయ్యల కాల్చడం వల్ల భూసారం తగ్గడంతోపాటు పంట దిగుబడిలోనూ నష్టం జరిగే ప్రమాదం ఉంది. రైతులు పొలాలను వేసవిలో దున్నుకోవాలి. తద్వారా నేలలో ఉన్న పురుగులను నశింపజేయాలి. జీలుగు విత్తనాలు వేస్తే భూములు సారవంతం అవుతాయి.

- ఎగిడి నాగరాజు, ఏఓ, నెక్కొండ

దున్నకుంటే కలిగే నష్టాలివే..

కోతల తర్వాత దుక్కి దున్నకుండా వదిలేస్తే భూమి గాలిని పీల్చుకునే శక్తి కోల్పోతుంది. లోతైన పొరల నుంచి నీరు ఆవిరైపోతుంది. కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూసారాన్ని తగ్గిస్తాయి. విత్తడానికి వారం, పది రోజుల ముందు దుక్కులు తయారు చేస్తే ఆశించిన మేరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

జీవాల మందను నిలిపితే దిగుబడి అధికం

గతంలో ఎండాకాలం పొలాల్లో జీవాల మందను నిలిపేవారు. వాటి మలమూత్రాలు పంటల ఎదుగుదలకు ఉపయోగపడుతుందని వ్యవసాయ నిపుణులూ వ్యాఖ్యానిస్తున్నారు. మారిన కాలానికి అనుగుణంగా పశుగణం తగ్గి పొలాల్లో మందపెట్టడం తగ్గింది. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఇళ్ల, పొలాల వద్ద ఏడాది పొడవునా నిల్వ చేసిన పశువుల ఎరువులను ఎండాకాలంలో పొలాల్లో వేయాలి. వర్షాలు కురిసిన తర్వాత ఆ ఎరువులను నేలపై చల్లి ట్రాక్టర్‌తో దున్నితే మట్టిలో కలిసిపోయి పంటలకు పోషకాలు అందుతాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట : చెన్నారావుపేట 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో అమీనాబాద్, చెన్నారావుపేట ఉపకేంద్రాల పరిధిలో నేడు నేడు (శుక్రవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈ తిరుపతి, ఏఈ జోగానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

- ఎంఈఓ శ్రీదేవి, ఎంపీడీఓ సునీల్‌కుమార్



శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

ఖానాపురం : క్రీడలతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా వికసిస్తారని ఎంఈఓ శ్రీదేవి, ఎంపీడీఓ అంబటి సునీల్‌కుమార్ తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని అశోక్‌నగర్‌లో అథ్లెటిక్స్, ధర్మారావుపేటలో జిమ్నాస్టిక్స్ శిబిరాలను ఏర్పాటు చేయగా ఎంఈఓ, ఎంపీడీఓ వేర్వేరుగా ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని రాణించాలని సూచించారు. క్రీడలతో పోటీతత్వం పెరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని తెలిపారు. క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు వరిస్తాయని వివరించారు. శిక్షణా శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ విజాకర్‌రావు, కోచ్ ఆరెల్లి శ్రీనివాసులు, రాధికారెడ్డి, లక్ష్మినారాయణ, కబడ్డీ కోచ్ యాట రవి, అథ్లెటిక్స్ కోచ్ శేఖర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం.. కేసు నమోదు

గూడూరు : బాలుడు అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా.. మండలంలోని చిన్న ఎల్లాపురం శివారు లక్ష్మణ్ తండాకు చెందిన వాంకుడోతు జాన్‌పాల్ అనే బాలుడు తండ్రి వాంకుడోతు కృష్ణమూర్తితో కలిసి ఆటోలో వస్తుండగా మార్గమధ్యలో నిద్రవస్తుండగా ఆటో నిలిపి పడుకున్నారు. తెల్లవారు జామున లేచి చూడగా జాన్‌పాల్ కనిపించలేదు. స్వగ్రామం, సొంత ఇల్లు, బంధువులు ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిల్లల పెంపకం కళ

నర్సంపేట : పిల్లల పెంపకాన్ని అద్భుతమైన కళగా శ్రీ గురుకులం విద్యాసంస్థల చైర్మన్ మోతె సమ్మిరెడ్డి అభివర్ణించారు. పట్టణంలోని మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌రావు అధ్యక్షతన సంజీవని ఆశ్రమంలో 'బాలలను ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షించడం' అంశంపై తల్లిదండ్రులకు గురువారం నిర్వహించిన అవగాహనా సదస్సుకు సమ్మిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు నైపుణ్యాలు అలవర్చుకోవాలని సూచించారు. ముఖ్య రిసోర్స్‌పర్సన్‌గా ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు ఎర్ర శ్రీకాంత్, బత్తుల కరుణ హాజరై పాజిటివ్ పేరెంటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ మాట్లాడుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతోపాటు మగ్గం, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అనంతరం మగ్గం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి



యాకయ్య (ఫైల్)

గీసుకొండ : గత నెల 30న గుట్కా మత్తులో ఎండ్రిన్ గుళికలు మింగిన మండలంలోని గొర్రెకుంటకు చెందిన కట్కూరి యాకయ్య (69) వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రశాంత్ బాబు మీడియాకు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన..

రాయపర్తి : మండలంలోని శివరామపురం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి గాయాల పాలైన గుర్తు తెలియని వ్యక్తి (బెగ్గర్) ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు. మృతదేహం ఎంజీఎం మార్చురీలో ఉందని ఎస్సై చెప్పారు. సంబంధీకులు సెల్ నంబర్ 8712685216, 8712685042 నంబర్లలో సంప్రదించాలని కోరారు.